న్నారు ఇద్దరూ. పక్కమీద పొర్లాడుతున్నా సరే తరిచి తరిచి కురిపిస్తున్నారు ప్రశ్నలు.

* * *

ఈ చేపల మూలాన రెండు సంవత్సరాలుగా నాకీబాధ తప్పిందిగాదు. ఆ ప్రశ్నలకి ఒక తాడూ బొంగరం అంటూవున్నా బాగుండును. 'వీటిని పెద్దతొట్టిలో ఎందుకు వెయ్యలేదు? కొంచెం మట్టి గూడా దీన్లో వెయ్యక పోయినారా? పెద్దయిం తర్వాత ఇవి ఏమౌతాయి' ఇల్లాంటివే అన్నీను.

ఒక వ్యవహారం గురించి నేను గ్రామాంతరం వెళ్ళవలసి వచ్చిందొకసారి. చేపల్ని మా స్నేహితుడికి అప్పగించి వెళ్ళాను. తిరిగి వచ్చేసరికి అవన్నీ సరియైవ పోషణలేక కావచ్చు చనిపోయాయి. చేపలైతే చచ్చిపోయినాయి గాని ప్రశ్నలు మాత్రం అక్షయంగానే వున్నాయి. నేను చస్తేగాని ఈ ప్రశ్నలు చావవేమో! ప్రతివాడూ పోయే వాణ్ణిపట్టుకొని ఆపటం; అక్కడనుంచీ,—

“పాపం, చచ్చిపోయాయట గాదుటండీ మీ చేపలు! ఎంత మాంఛి చేపలండి వాటి దుంపతెగా! అసలు అట్లా ఎట్లా చచ్చిపోయాయో! ఎవరి దగ్గర మీరు వాటిని వదిలిపెట్టింది? అయ్యన్నేం పోయింది వాటిని సరిగ్గా చూసివుండడు, మాలాంటి వాళ్ళకప్పగించి పోయినా నిక్షేపంలా కాపాడే వాళ్ళం. బహుశః నేననుకుంటానూ, ఆయనెవరో నీళ్ళుమార్చి వుండడు. అసలే తింటానికి ఏమైనా వేశేవాడో అదీలేదో’ అంటూ సానుభూతి ప్రకటించటం.

ఇంతకాలం తర్వాత ఇప్పుడు ఎవరైనా ఆ సంగతి ఎత్తి ప్రశ్నిస్తారేమోనని హడలు పుడ్తూ వుంటుందంటే నమ్మండి!

(ఉర్దూ మాతృక ఆధారంగా)

---

స్కెచ్

# కొత్తా—పాతా

“పారిజాత”

గ్రామ కచేరీ దగ్గర జనం గుమిగూడి వున్నారు. కచేరీ సావడిలో గ్రామమునసబు శరభయ్య రెవెన్యూ ఇనస్పెక్టరుతో మంతనాలు జరుపుతున్నాడు. కరణాలు నల్గురూ బయట నిలబడ్డారు. బయటనున్న రైతులు మాత్రం గ్రూపులుగా విడిపోయి వారివారి సాధక బాధకాలను గూర్చి, అనుభవాలను గురించీ చర్చించుకొంటున్నారు.

ఇంతలోనే ఇనస్పెక్టరుగారు టకటక బూట్లు నేలను తన్నుకుంటూ వచ్చి తన ర్యాలీ సైకిలుపై ఆసీనులవుతూ మునసబు, కరణాలవద్ద వందనాలు స్వీకరించి రైతులకేసి మార్వెలస్‌గా పోజు విసిరేడు. రైతులలోకి మోతుబరులిర్వురు ఎదురుగా వచ్చి నమస్కారాలు అందచేశారు. అవి స్వీకరిస్తూ “మీ మునసబుగారితో అంతా మాట్లాడాను. రేపు మంగళవారం మీలో నల్గురు మునసబుగారితో కలిసి మా ఆఫీసుకురండి. ఆపైదంతా నేనీలోగానే పూర్తిచేసి వుంచుతా” అంటూ వెళ్ళిపోయాడు.

మోతుబర్లు మునసబుగారి కేసిచూడగానే శరభయ్య గెజిటెడ్ ఆఫీసరు మామగారిలా పోజు పెట్టి లోనికి తప్పుకున్నాడు.

అసలీ మోతుబర్లందరికీ శరభయ్య అంటే నమ్మకం లేదు. వెనక టరన్ దాళ్వా లేనివారికి అడిషనల్ దాళ్వాపంట తెప్పిస్తానని ఎకరాకు పది రూపాయల వంతుని వసూలుచేసి ఆర్డర్లు వచ్చేసినవని తూర్పు లంకలవైపు వారి నందర్నీ నమ్మించాడు. వారందరూ నిజమేననుకొని దమ్ములు చేసుకొని నారునాటుకొన్నారు. చేను మూల తిరిగింది. రైతులు శరభయ్యని స్తుతించారు. నెల

తెరక్కుండానే చేలు ఎండిపోయాయ్. టరన్ దాళ్వాలకే నీరు సరిపోక అవి ఎండిపోతే అడిషనల్ దాళ్వాకి నీరెక్కడుంటుంది? ఈవిధంగా అడిషనల్‌గా సాగు జరిగినట్లు పై అధికారులకు తెలియకపోవడంవల్ల మామూలుగానే నీరువదలి పెట్టారు. దీంతో గ్రామంలో అలజడి బయలు దేరింది. పెద్దమనుష్యులు కొందరు శరభయ్యను కల్సుకొని రహస్యంగా చర్చించారు.

తత్పర్యవసానంగా శరభయ్యగారు జిల్లా కేంద్రంలో వారంరోజులు మకాం వేయవలసి వచ్చింది - ఫలితంగా చేలు పూర్తిగా ఎండిపోయినాయి. రైతులు మహాగోల పెట్టారు. కాని యీ గోల శరభయ్య కళ్ళారా చూడలేదు. చెవులారా వినాలేదు. కాని అతనికి తెల్సు ఫలితం ఎట్లా వుంటుందో—అందుకే జిల్లా కేంద్రంలో క్యాంపు వేశాడు.

రైతులు శరభయ్యమీద ఆగ్రహంతో పిటిషన్లు పెట్టుకున్నారు. దానిమీద అధికార్లు తనిఖీకి రావడం రిపోర్టులివ్వడం — దానిమీద ఆర్డర్లు రావడం—ఫలితంగా శరభయ్య ఉద్యోగంనుంచి తాత్కాలికంగా సంవత్సరంపాటు తప్పుకోవడం కూడా జరిగినై.

ఇంతరభస పెంచిన శరభయ్యని తిరిగి ఎట్లా నమ్ముతారు వారుమాత్రం. అందుకే వేరుగా రెవెన్యూ అధికారులకు మనవి చేసుకొన్నారు. కాలువలు తెరచి నెలదాటి పోతూంది. వర్షాలు కూడా లేవు. మృగశిరకార్తె ప్రవేసించే సరికి గ్రామ కమతంలో సగం సాగయిపోయేది. అటువంటిది పునర్వసు కార్తె కూడా ముగిసింది. గ్రామంలో సెంటుభూమికూడా సాగుకాలేదు. వచ్చిన నీరు ఏ కొద్దిమందికో సరిపోయింది. వారైనా దమ్ములు పూర్తిచేయ గల్గారు-అంతే. యిదంతా శరభయ్య పన్నాగమే అని అందరికీ తెలిసినా— అతని భూమికూడా అల్లాగేవుంది. అతనికి చీమైనా కుట్టినట్టు లేదు.

ఇదంతా చూసేసరికి ఏమీతోచక పై అధికారులకు అర్జీలు పెట్టున్నారు. దానిఫలితంగానే రెవెన్యూ డిపార్టుమెంటుకు రిప్రజెంటేటివ్‌గా యీనాడు యిక్కడకు యీయనగారు రావడం— శరభయ్యతో సంప్రదింపులు జరపడం జరిగింది.

రైతులంతా ఒకచోట సమావేశమై నలుగుర్ని శరభయ్య దగ్గరకు పంపేరు. శరభయ్యా ఆ నలుగురూ రాత్రి చాలా పొద్దుపోయేవరకూ సంప్రదించుకొని విడిపోయారు.

మర్నాడు గ్రామంలో కొంత సంచలనం కలిగింది. "విడివిడిగా కొంతమంది ప్రతియింటికిపోయి సొమ్ము వసూలు చేయడం మొదలెట్టారు.' గ్రామ కమతం అంతా పూర్తిగా సాగుఅయి పంట చేతికొచ్చే వరకూ ఎన్నిసారులు కావలసినా నీరు సప్లయ్‌చేసే నిమిత్తమై ఎకరాకు అయిదు రూపాయలు చొప్పున వసూలు చేయడానికి గతరాత్రి నిర్ణయించుకొన్నారు. అది వెంటనే అమలు జరిగిపోయిందికూడా. ఆ విధంగా యిచ్చుకోలేనివారు మాత్రం యీ సాలుకు పంటపండించుకో కూడదు. ఇదికూడా వారి నిర్ణయంలో ఒక భాగమే అందరూ పేరు మోసిన రైతులు తగినంత పెట్టగల సమర్థులు ఇటువంటి నిర్ణయాలు పేదరైతులమీద రుద్దగల ధీశాలురు. అందుచేతే వారిఎత్తుపారింది.

మర్నాడు మంగళవారం శరభయ్య నలుగురు పెద్దరైతులను వెంటబెట్టుకొని రెవెన్యూ ఇన్‌స్పెక్టరు గారింటికి వెళ్ళారు. వారికి అదే ఆఫీసు అదే యిల్లు కూడా.

పెద్దమనష్యులు బయట నిలబడ్డారు. శరభయ్య లోపలికి వెళ్ళాడు. వీరు యిల్లా నిలబడే వున్నారు. వారు లోపలేవున్నారు. అరగంటకు ఇన్‌స్పెక్టరుగారు మందహాసం చేస్తూవచ్చి—"అరే నిలబడేవున్నారే మాటల ధోరణిలో మీమాటే మర్చిపోయాం. శరభయ్యగారు అంతా చెప్పారు. నాకు తెల్సు మీ కష్టాలన్నీ—యీ రోజే నేను పోయి ఓవర్‌సీర్ గారితోటీ ఇంజనీరుగారితోటీ మాట్లాడి రేపటికల్లా అంతారైటు చేస్తాను యింక మీరు వెళ్ళిపోవచ్చు. శరభయ్యగారు తర్వాత వస్తారులే"—అంటూ నెమ్మదిగా గదిలో ప్రవేశించాడు. శరభయ్య చేతితో వారికేదో సంజ్ఞ చేస్తూ వారిని వెంబడించాడు. ఆ సంజ్ఞ వారికేం అర్థమయిందోకాని వారు నెమ్మదిగా నిష్క్రమించారు.

★